# ధనాశ!

శ్రీ చివుకుల చెంచు పున్నయ్యశాస్త్రి

అది యూరి బయలుప్రదేశము. అచ్చటనేక రకములైన చెట్లున్నవి. వాటిమధ్య నొక యిల్లున్నది. అది పూటకూలిపెట్టు వెంకమ్మది. ఆమెకు నలుగురు కుమారులు. వారికి వివాహమై భార్యలు కాపురానికి వచ్చారు. వెంకమ్మకు మొదటి ముగ్గురు కోడండ్లమీద ప్రేమ జాస్తి. నాల్గవ కోడలి పేరు లక్ష్మి. గుండ్రని ముఖము, సోగకండ్లు ఆమెకెంతో అందాన్ని కూరుస్తుండేవి. వెంకమ్మకు లక్ష్మియంటే సరిపడేదికాదు. ఎల్లప్పుడూ తిడుతూ సరిగ్గా అన్నముకూడ తిననిచ్చేదికాదు. ఈవిషయమును వెంకమ్మ తన కొడుకుకు తెలియనియ్యకుండా కప్పిపెట్టేది. పాపం లక్ష్మికూడా తన భర్త రామయ్యతోటి తన కష్టములను చెప్పుకునేది కాదు.

అవి వరికోత రోజులు. రామయ్య గుడ్డల వ్యాపారమునకు రెండునెలల క్రిందట పోయి ఇంకా రాలేదు. వెంకమ్మ యిదేసమయముగదాయని లక్ష్మికి యితర కోడండ్లకంటె రెండింతలపని పెట్టడం మొదలుపెట్టింది.

సూర్యాస్తమయమయింది. చీకటి క్రమక్రమముగా వ్యాపించటము మొదలుపెట్టింది. పొలాల్లోని రైతులిండ్లకు మరలారు. పాపం లక్ష్మి యొకతె సన్నని గొంతుకతో పాటపాడుకూ, చీకట్లో పైరు కోస్తున్నది. అప్పుడాదారిన కొందరు మనుష్యులుపోతూ, ఆపాటవిని దగ్గరకుపోయి "ఎవరమ్మా నీవింత చీకటిపడినా యింటికి పోలేదు" అని అడిగారు. దానికామె "బాబూ నేను వెంకమ్మగారి కోడలిని. నేనివ్వాళ యీ కోత పూర్తిచేస్తేనే కాని మాఅత్త బ్రతుకనివ్వదు" అని అమాయకంగా బదులు చెప్పింది. ఆమాటలు వినేసరికి వారి హృదయాలు నీరైపోయినవి. వారిలో నలుగురా పైరునంతా కోసి లక్ష్మిని యింటికి పంపించారు.

రాత్రి యెనిమిది గంటలయింది. ఎవరో యొకాయనవచ్చి వెంకమ్మగారి యింట్లో దిగి బసకు, భోజనానికి మొత్తంగా మాట్లాడుకున్నాడు. భోజనమయినతరువాత వెంకమ్మను "ఏమండీ! ఈ ఊళ్ళో ఎవరైనా... ......యీరాత్రికి దొరుకుతారా"యని అడిగాడు. వెంకమ్మ కొంచెముసేపాలోచించి "ఎందుకు దొరకరండి పదిరూపాయలిస్తే" యన్నది. సరే మాట్లాడేమన్నాడా నూతన వ్యక్తి. వెంకమ్మ గబగబ యింట్లోకిపోయి లక్ష్మికి కడుపారన్నముపెట్టి, మంచిచీరారవికా కట్టపెట్టి సింగారించ మొదలుపెట్టింది. ఇన్నాళ్లు సరిగ్గా అన్నమైన పెట్టనిది యివ్వాళ తన అత్తగారికింత దయగల్గుట చూచి ఆశ్చర్యపడటం మొదలుపెట్టింది. వెంకమ్మ మంచినీళ్ల చెంబు లక్ష్మిచేతికిచ్చి గదిలోపెట్టి రమ్మని చెప్పిపంపి వెంబడేపోయి తలుపుబైట గొళ్ళెము పెట్టింది.

అప్పుడిక లక్ష్మి మనస్సెలాగుంటుందో ఆలోచించండి. మంచముమీద పండుకొనియుండిన పురుషుని చూచి సింహాన్నిచూచిన జింకపిల్లలాగ గడగడలాడటం మొదలుపెట్టింది. పెద్దంగా అరుస్తామనుకున్నది కాని నోరు రాలేదు. తడబడుతున్న అడుగులతో తల వంచుకొనిపోయి యొకమూల నిలువబడింది. లక్ష్మి స్థితి చూచి జాలిగలిగి మంచముమీది పురుషుడు ఆమె దగ్గరకుపోయి గెడ్డము పట్టుకొని "లక్ష్మి" అంటూ తల పైకెత్తాడు. ఎవరనుకున్నారా నూతనవ్యక్తి? లక్ష్మి మగడు. అప్పుడిక వారి ఆనందానికి మేరయేలేదు. రామయ్య తాను యూరినుండి తెచ్చిన నగలు, చీరెలు లక్ష్మికిచ్చాడు. లక్ష్మి వాటిని ధరించి మురియడం మొదలుపెట్టింది. ఆరాత్రి యంతా వారు కులాసాగా గడిపారు.

మరునాడుదయం ఆరుగంటలయింది. రామయ్య నిద్రలేచి బయలుభూమికిపోయి వచ్చి అరుగుమీద కూర్చొని ముఖము కడుగుకుంటున్నాడు. వెంకమ్మ పెద్దకోడలు రామయ్యనుచూచి గుర్తుపట్టి అత్తదగ్గరకుపోయి "రాత్రి మన యింటికి వచ్చింది నీ చిన్నకొడుకే నత్తా"యని చెప్పింది. ఆ సమాచారము వినగానే వెంకమ్మ గుండెల్లో గభీలుమన్నది. రామయ్య తిన్నంగా వంటయింట్లోకిపోయి "అమ్మా! యీలాగ నేను పోయిన తర్వాత యెన్నిరూపాయలు సంపాయించావు" అని నవ్వుతూ వెక్కిరిస్తున్నట్లు అడిగాడు!

వెంకమ్మ తలయెత్తలేదు......మరునాడింటిలో కనబడలేదు...ఎక్కడికిపోయిందో తెలీదు.

"కథాంజలి"

అన్ని హిగ్గిన్ బాథమ్సు రైల్వే బుక్ స్టాల్సులోను దొరుకుతుంది.